క్లుప్తంగా

రైతులకు అందుబాటులో ఉండాలి



పులకుర్తి రైతు భరోసా కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్ : ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న వేళ రైతు భరోసా కేంద్రాల సిబ్బంది తప్పనిసరిగా రైతులకు అందుబాటులో ఉండి సేవలందించాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ ఆదేశించారు. గురువారం మండలంలోని పులకుర్తి రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఖరీఫ్‌లో సాగు చేసే పంటలు, విత్తనాల ఎంపికపై రైతులతో చర్చించారు. ఏఓ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కుగాను రైతులకు అవసరమైన సబ్సిడీ వేరుశనగ విత్తనాలు ప్రతి ఆర్బీకేలో అందుబాటులో ఉన్నాయన్నారు. పత్తి సాగు చేసే రైతులు వర్షాలు పడి భూమి పదునెక్కిన తర్వాతనే విత్తనాలను విత్తుకోవాలని సూచించారు.

నేడు వలంటీర్లకు సన్మానం

పాణ్యం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉదయం మండలంలోని వలంటీర్లకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దస్తగిరి గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా వజ్ర, రత్న,మిత్రల అవార్డు, ప్రోత్సాహక నగదు బహుమతి అందజేసి సన్మానం ఉంటుందన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరవుతారన్నారు.

కూలీలు జాగ్రత్తలు పాటించాలి

గూడూరు రూరల్ : ఉపాధి కూలీలు పనుల వద్ద ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ఏపీఓ రామేశ్వరమ్మ సూచించారు. గుడిపాడులో చేపట్టిన ఉపాధి పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడతూ ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉపాధి పనులకు వచ్చే కూలీలు ఉదయం 6 గంటల లోపు పని ప్రదేశాలకు చేరుకోవాలన్నారు. ఫీల్డుఅసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ సూచించిన కొలతల ప్రకారం పనులను చేయాలన్నారు. పనులు చేసే సమయంలో అలసటగా, నీరసంగా ఉంటే సమీపంలోని చెట్ల కింద సేదతీరాలన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలి



ప్యాలకుర్తి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

కోడుమూరు రూరల్ : జగనన్న గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు మంజూరైన లబ్ధిదారులంతా సకాలంలో నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. గురువారం మండలంలోని ప్యాలకుర్తి జగనన్న కాలనీని తహసీల్దార్ శేషఫణి, హౌసింగ్ డీఈఈ వాసుదేవరావు, ఏపీఎం పుష్పావతిలతో కలిసి సందర్శించారు. గృహ నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పనులు త్వరగా పూర్తి చేసుకుంటే ప్రభుత్వం బిల్లులను త్వరగా మంజూరు చేస్తుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

సి.బెళగల్: గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామానికి చెందిన మహిళ తీవ్రంగా గాయపడింది. స్థానికుల సమాచారం మేరకు వివరాలు .. పోలకల్‌కు చెందిన తుమ్మిళ్ల వెంకటేష్ తన భార్య తుమ్మిళ్ల జ్యోతితో కలిసి నందవరం మండలం నాగులదిన్న గ్రామంలో తన కూతురును చూసేందుకు స్కూటర్ (ఏపీ21ఏటీ1852)పై బయలుదేరారు. సి.బెళగల్ గ్రామ శివారు ఇటుకల బట్టీలకు సమీపంలో కర్నూలు నుంచి ఎమ్మిగనూరుకు వెళ్తున్న ఆర్టీసీ అద్దెబస్సు (నంబర్ ఏపీ 39 యూజీ 0277- ప్రైవేట్)ను క్రాస్ చేసి స్కూటర్ ముందుకు వెళ్తున్న సమయంలో స్కూటర్‌పై నుంచి తుమ్మిళ్ల జ్యోతి కిందపడింది. స్కూటర్ వెనుక వస్తున్న బస్సు ముందు టైరు మహిళపై నుంచి వెళ్లడంతో రెండు కాళ్లు పూర్తిగా చితికిపోయి తీవ్ర రక్త స్రావం అయ్యింది. ఘటనా స్థలానికి పోలీస్ సిబ్బంది శ్రీనివాసులు గౌడ్, సుదర్శనం, శ్రీనివాసులుతో చేరుకున్న హెడ్‌కానిస్టేబుల్ రామయ్య బాధితురాలిని వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. కాగా ప్రమాదంలో గాయపడిన మహిళ పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వర్గీకరణతోనే భవిష్యత్తు

పాణ్యం: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు భవిష్యత్తు అని ఎంఆర్‌పీఎస్ నాయకులు అన్నారు. గురువారం పాణ్యం మండలంలోని బపలనూరు గ్రామంలో గో టూ 50డేస్ విలేజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కన్వీనర్ తిమ్మయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో మాదిగలు అన్ని రంగాల్లో వెనుకబడ్డారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ చేసి మాదిగల అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. ఎంఎస్ఎఫ్ మండల కార్యదర్శి బాబు, నంద్యాల కో- కన్వీనర్ నరసింహ, శేషు, సుధాకర్ పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

- పొలాలను సిద్ధం చేసుకుంటున్న రైతన్నలు
- వేసవి దుక్కులు దున్నుకోవడంలో అన్నదాతలు బిజీ
- భూసారాన్ని పెంచేలా అధికారుల సూచనలు



తిరుపాడు గ్రామంలో దుక్కి దున్నుతున్న రైతన్న

గడివేముల: ఖరీఫ్ సీజన్‌కు మండంలోని రైతన్నలు ఉత్సాహంగా సిద్ధమవుతున్నారు. పంట భూముల్లో వేసవిలో దుక్కలు దున్నుకుని పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. రైతన్నలు కాడెద్దులతో, యంత్రాలతో వేసవి దుక్కుల పనుల్లో బిజీగా ఉన్నారు. కూలీలు పొలాల్లో ఉన్న రబీ సీజన్ పంట వ్యర్థాలను తొలగించే పనుల్లో నిమగ్నమయ్యారు.

21వేల ఎకరాల్లో పంటల సాగు..

మండలంలోని 14 గ్రామపంచాయతీలలో 32 వేల ఎకరాల సాగు భూమి ఉంది. అందులో ఖరీఫ్‌లో 21వేల ఎకరాల్లో సాగుచేస్తున్నారని వ్యవసాయాధికారులు తెలిపారు. వీరిలో చాలమంది రైతన్నలు వేసవి దుక్కులు చేపట్టారు. కాగా సీజన్ ప్రారంభంలోనే ఆయా గ్రామంలోని ఏ పోలంలో ఏఏ పంటలు వేయాలో మట్టినమూనాలు సేకరించి రైతు భరోసా కేంద్రం సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే రైతుభరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీపై నాణ్యమైన విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు, ఎరువులను అందిస్తున్నారు. రైతులకు అవసరమైన సలహాలు సూచనలు అందిస్తున్నారు.

ప్రతిరైతు వేసవి దుక్కులు దున్నుకోవాలి



రబీ సీజన్ పూర్తి అవగానే ప్రతి రైతు వేసవి దుక్కులు తప్పకుండా దున్నుకోవాలి. వేసవి దుక్కులు దున్నుకోవడం ద్వారా విత్తన ఎదుగుదల, పంటసాగు, పంటదిగుబడి బాగా ఉంటుంది. పంటలకు తెగుళ్లకుడా సోకవు. విత్తనాలు కూడా బాగా మొలకెత్తుతాయి. ఆయా గ్రామాల్లోని ఆర్బీకేలో వ్యవసాయ సిబ్బంది రైతులకు సలహాలు సూచనలు ఇస్తున్నారు. ఇప్పటికే ఆర్బీకేలలో పచ్చిరొట్ట ఎరువులైన పిల్లిపెసర, మినుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. –హేమసుందర్‌రెడ్డి, ఏఓ

వేసవి దుక్కులు దున్నుతున్నాం



ప్రస్తుతం వేసవి దుక్కులు దునున్నుతున్నాం. లోతుగా దున్నుకోవడం వల్ల వర్షపు నీరు పొలంలో ఇంకిపోతుంది. దీంతో భూమి నీటిని బాగా పీల్చుకొని భూమిలో తేమశాతం పుష్కలంగా ఉండి భూమి సారవంతంగా తయారవుతుంది. వేసవి దుక్కులతో తెగుళ్లు కూడా నివారించవచ్చు.

– శివుడు,రైతు,గడిగరేవుల గ్రామం

విత్తనాలు బాగా మొలకెత్తుతాయి



వేసవిదుక్కులు దున్నుకోవడంతో వర్షాలు పడినప్పుడు నీరు ఆదే పొలంలో ఇంకిపోయి తేమశాతం బాగా ఉండడంతో విత్తనాలు వేసినప్పుడు బాగా మొలకెత్తుతాయి. అదేవిధంగా పంటలను ఆశించే కీటకాలు, శిలీంద్రాలు, కలుపుమొక్కలు నశించడంతో పంట ఏపుగా పెరిగి మంచి దిగుబడి వస్తుంది.

– చిన్న శాలు, రైతు, బూజునూరు

'నాడు-నేడు' పనులు వేగవంతం చేయండి



గడివేముల హైస్కూల్‌లో విద్యాకానుక కిట్లను పరిశీలిస్తున్న అధికారులు

గడివేముల: ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని ప్లానింగ్ కోఆర్డినేటర్ మనోహర్‌రెడ్డి సూచించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంతో పాటు గురువారం కేజీబీవీ పాఠశాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న నాడు-నేడు పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. పాఠశాల ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రామకృష్ణుడు, ఏపీఎం హజరత్, సిబ్బంది విజయ్‌కుమార్, హిదాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. గురువారం సాయంత్రం ఎమ్మెల్యే నివాసంలో నాలుగు మండలాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోడుమూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 26న కర్నూలు మండలం పసుపుల గ్రామంలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ నెల 26న వలంటీర్లకు వందనం కార్యక్రమం కోడుమూరులో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 27న సి బెళగల్ మండలం పలదొడ్డి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం సి బెళగల్ మండలంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం ఉంటుందన్నారు. మధ్యాహ్నం వలంటీర్లకు వందనం కర్నూలు మండలం నందనపల్లె గ్రామంలో నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. అలాగే ఈనెల 29న కర్నూలు మున్సిపాలిటీలో పరిధిలోని బాలాజీనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఎంపీడీఓలు ఎస్ భాస్కర్ నాయుడు, మాధవీలత, చంద్రశేఖర్, రాముడు పాల్గొన్నారు.

వేతనం రూ.272 పడేలా పనులు కల్పించాలి

- డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి



జి శింగవరంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

కర్నూలు (న్యూటౌన్): ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు దినసరి వేతనం కనీసం రూ.272 పడేలా పనులు కల్పించాలని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి మండల అధికారులను ఆదేశించారు. గురువారం కర్నూలు మండలంలోని నిడ్జూరు, జి శింగవరం గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ 6గంటలకే ఉపాధి కూలీలు ఫీల్డ్‌లో పని చేసేలా చూడాలని సూచించారు. వేసవికాలంలో గ్రామాల్లో వలసల నివారణకు కూలీల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రైతులు ఉపాధి హామీ పథకం కింద తక్కువ ఖర్చుతో చీనీ, నిమ్మ, జామ, మామిడి, సపోట, కొబ్బరి, సీతాఫలం, అల్ల నేరేడు, చింత, ఆపిల్ బేర్, డ్రాగన్ ఫ్రూట్, గుండె మల్లెలు, గులాబీ పూల సాగు చేపట్టి లాభాలు గడించాలని సూచించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 100 శాతం సబ్సిడీతో తోటల పెంపకానికి ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహం అందిస్తోందని చెప్పారు. మండల ఇంజినీర్ మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు



మాట్లాడుతున్న ఆర్టీసీ చెర్మన్ మల్లికార్జునరెడ్డి

పాణ్యం : రాష్ట్రంలో ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిచడమే ప్రభుత్వ లక్ష్యమని ఆర్టీసీ (ప్రజా రవాణ శాఖ) చెర్మన్ మల్లికార్జునరెడ్డి అన్నారు. గురువారం కడప నుంచి కర్నూలుకు వెళ్తూ పాణ్యంలోని ఓ హోటల్ వద్ద నిలిచి స్థానిక నాయకులతో కొద్దిసేపు గడిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రయాణికులకు సకల సౌకర్యాలతో నూతన బస్సులను నడపుతున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో బస్సులు సరిగ్గా లేక సిబ్బంది, ప్రయాణికులు ఇబ్బందులు పడేవారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టాక అధునాథన సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన బస్సులను నడపుతున్నారని చెప్పారు. అలాగే బస్టాండ్‌లతో ప్రయాణికుల సౌకర్యార్థం మరుగుదొడ్లు, తాగునీరు, ఫర్నిచర్, రెస్టింగ దుల లాంటి సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. అలాగే శిథిలావస్థకు చేరుకున్న పలు బస్టాండ్‌లను ఆధునికీకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వరయ్య, గోరవర్ధన్‌రెడ్డి, గురుమూర్తి తదితరులు ఉన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా సచివాలయం



కె.నాగలాపురంలోని గ్రామ సచివాలయ భవనం

గూడూరు రూరల్ : మండల పరిధిలోని కె.నాగలాపురంలో పంచాయితీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ భవన నిర్మాణ పనులు పూర్తి కావడంతో ప్రారంభానికి సిద్ధమయ్యింది. గతేడాది గ్రామ సచివాలయ భవన నిర్మాణానికి రూ. 35 లక్షలు మంజూరు కాగా.. కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కాగా పేయింటింగ్, నేమ్ బోర్డు ఏర్పాటు వంటి పనులను కాంట్రాక్టర్ పూర్తి చేయడంతో అధికారులు రానున్న ఐదు రోజుల్లో ఎమ్మెల్యే మీదుగా భవనాన్ని ప్రారంభింపచేసేందుకు ఏర్పాట్లను చేపట్టారు. ప్రస్తుతం గ్రామ సచివాలయం అద్దె భవనంలో కొనసాగుతుండగా, నూతన సచివాలయ భవ నం అందుబాటులోకి వస్తే ప్రజలకు మరింత సేవలను అందించేందుకు ఉద్యోగులకు సౌకర్యంగా ఉంటుంది.

గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ సర్వే



నూతనపల్లెలో గ్రౌండ్ ట్రూతింగ్ సర్వే చేస్తున్న వీఆర్‌ఓలు, సర్వే సహాయకులు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం బీ తాండ్రపాడు, నూతనపల్లె గ్రామాల్లో రైతులకు సంబంధించిన భూముల్లో గ్రౌండ్ ట్రూతింగ్ ఫీల్డ్ సర్వే ప్రారంభమైందని పీఎల్‌ఆర్ డీటీ శారద తెలిపారు. గురువారం ఆమె మండల పరిధిలోని బీ తాండ్రపాడు, నూతనపల్లె గ్రామాల్లో జరుగుతున్న సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ సర్వేలో భాగంగా ఆయా గ్రామాల్లో ఏ సర్వే నంబర్లలో ఏ రైతు ఉన్నారో, ఆ రైతు భూమి ఎంత, ఎక్కడి నుంచి ఎక్కడి వరకు హద్దులను గుర్తిస్తున్నామన్నారు. గ్రౌండ్ ట్రూతింగ్‌లో రైతుల భూములు, ప్రైవేట్ భూములను గుర్తించి నివేదిక తయారు చేస్తామని చెప్పారు. భూముల రీ సర్వే, గ్రౌండ్ ట్రూతింగ్ సర్వేల్లో వివరాలపై క్షుణ్ణంగా పరిశీలిస్తామని, ఆ తర్వాత రెండు సర్వేల్లో హెచ్చుతగ్గులకు తావివ్వకుండా ఎవరి భూమి ఎంత అనేది స్పష్టంగా నమోదు చేసి, హద్దులు చూపిస్తామని వివరించారు. అనంతరం డిజిటల్ రికార్డులను తయారు చేసి రైతులకు జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలను అందజేసేందుకు కసరత్తు చేస్తున్నామని తెలిపారు.

మరింత బాధ్యతగా పని చేయండి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- ఉలిందకొండలో వలంటీర్లకు సేవా పురస్కారాలు



వలంటీర్‌కు అవార్డును అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: గ్రామ వలంటీర్లు మరితం బాధ్యతగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఉలిందకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉలిందకొండ-1,2, కొంగనపాడు, నాయకల్లు, చిన్నటేకూరు, తడకనపల్లె, పెద్దటేకూరు, బస్తిపాడు, బొల్లవరం, పుసులూరు గ్రామ సచివాలయాలకు చెందిన వలంటీర్లకు సత్కారం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు సర్పంచ్ మాసేపోగు సుంకులమ్మ, గ్రామ నాయకులు ఉలిందకొండ రమణారెడ్డి, ఏ.వి.రమణ, శ్రీనివాసులు, శీనయ్య, మహిళలు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వలంటీర్లకు సేవ పురస్కారాలు అందజేసి సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలు పేదలకు చేరవేయడంలో వలంటీర్లదే ప్రధాన పాత్ర అన్నారు. వలంటీర్లపై సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో నమ్మకం పెట్టుకున్నారని, ఆ నమ్మకానికి అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. లోకేష్ యువగళం పాదయాత్రతో ఒరిగేదేమీలేదన్నారు. లోకేష్ ఏ నియోజకవర్గంలోకి వెళ్లినా అక్కడి ఎమ్మెల్యేలపై అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు.

వలంటీర్లకు అవార్డులు

చిన్నటేకూరు, ఉలిందకొండ గ్రామానికి చెందిన వలంటీర్ ఎం.చంద్రశేఖర్, శివనారాయణ సేవ వజ్రా అవార్డును, నబీసా, శ్వేతాకుమారి, మలక్ష్మమ్మ, చాంద్ బాష, సుజాత వలంటీర్లకు సేవ రత్న అవార్డులను, మిగితా వలంటీర్లకు సేవ మిత్ర అవార్డులను అందించి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కల్లా వెంకట రమణారెడ్డి, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి, కల్లూరు సొసైటీ అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి, మండల నాయకులు ఈశ్వరయ్య, రామకృష్ణారెడ్డి, హనుమంతురెడ్డి, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు సైనికుల్లా సేవలు అందించాలి



నన్నూరులో వలంటీర్లను అభినందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: వలంటీర్లు సైనికుల్లా సేవలు అందించాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని నన్నూరు – 3 వ సచివాలయం వద్ద ×వలంటీర్లకు వందనం₹ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ శివనాగప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు, ఎంపీపీ తిప్పన్న, గ్రామ సర్పంచు బ్రహ్మయ్య, మాజీ సర్పంచు చెన్నారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమానికి ముందుగా దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాంస్య విగ్రహానికి గజమాలతో నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. మండలంలో ఏనాడు జరగని అభివృద్ధి పనులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరిగిందన్నారు. ప్రతిపక్షాలు అభివృద్దిని చూసి ఓర్వలేక సంబంధంలేని ఆరోపణలకు పాల్పడడం బాధాకరమన్నారు. సీఎం జగన్, మంత్రి బుగ్గన చొరవతోనే మండలంలో పారిశ్రామిక కారిడార్ రావడం జరిగిందన్నారు. స్టీల్ ప్లాంట్‌లో 30 శాతం స్థానికులకు, 70 శాతం స్థానికేతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నిరింతర విద్యుత్ సదుపాయం కల్పించాలనే ఉద్దేశంతో ఉయ్యాలవాడ వద్ద నూతన విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం అవార్డులు అందుకున్న వలంటీర్లను శాలువాలతో సత్కరించి, పశంసాపత్రాలతో అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ తిప్పన్న, సర్పంచు బ్రహ్మయ్య, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పద్మనాభరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ లోటర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి అండగా..

గడివేముల: తోడబుట్టిన వారు ఆపదలో ఉంటే ఆదుకునేందుకు ఆలోచించే వ్యక్తులు ఎంతో మంది ఉన్నారు. తాము బాగుంటే చాలు ఎవరి గురించి మాకొద్దు అనుకునే వారు కోకొల్లలు. అయితే వీరు మాత్రం అందుకు భిన్నంగా కష్టాలలో ఉన్న మిత్రుడి కుటుంబానికి తాము అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. గడివేముల మండలం గ్రంధివేముల గ్రామానికి చెందిన నరేంద్రగౌడ్ నెల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జిల్లాపరిషత్ పాఠశాల 1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు గురువారం నరేంద్ర ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్నేహితులందరు కలిసి పోగు చేసిన రూ.70 వేలను అతని భార్యకు అందించారు. దీంతో ఆపదలో ఉన్న స్నేహితుని కుటుంబానికి అండగా నిలిచిన క్లాస్‌మెట్స్‌ను పలువురు అభినందిస్తున్నారు. కార్యక్రమంలో అలీబాషా, సుధాకర్, సాలెహా, జమాల్, కిషోర్, చిన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

కల్లూరు: సూరత్ జాతీయ రహదారి నిర్మాణంలో ప్లాట్లు కోల్పోయిన బాధితులకు నాన్ అగ్రిక్చర్ కింద నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని గురువారం తహసీల్దార్ రమేష్ బాబును బాధితులు కోరారు. దూపాడు పరిధిలోని 185, 186, 186-పి, 213 సర్వేనంబర్లలో వేసిన వివిధ పేర్లతో వెసిన వెంచర్‌లలో ప్లాట్స్ సూరత్ జాతీయ రహదారిలో పోతున్నాయన్నారు. ప్లాట్స్ కోల్పోతున్న బాధితులకు నష్టపరిహారం అగ్రికల్చర్ కింద కాకుండా నాన్ అగ్రికల్చర్ కింద నష్టపరిహారం చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బాధితులు జనార్దన్ గౌడ్, ఆంజనేయులు, ఫణీంద్ర, వెంకటేష్, లక్ష్మీదేవి, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలి

సి.బెళగల్: గ్రామ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి, సంక్షేమ పథకాలకు అర్హులైన వారందరికీ అందేలా చూడాలని ఎంపీడీఓ రాముడు ఆదేశించారు. గురువారం ఆయన మండల పరిధిలోని పోలకల్ – 2 గ్రామ సచివాలయంను ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయ పరిసరాలు, రికార్డులు, ఉద్యోగులు, వలంటీర్ల హాజరును పరిశీలించారు. సచివాలయ పరిధిలోని సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలను ఎంపీడీఓ పంచాయతీ కార్యదర్శి రఫిని అడిగి తెలుసుకున్నారు. సచివాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

సేవల్లో జాప్యం లేకుండా చూడండి

- విద్యుత్ శాఖ ఓఎస్‌డీ శ్రీనివాసులు

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ సేవల్లో జాప్యం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ ఓఎస్‌డీ శ్రీనివాసులు సూచించారు. గురువారం కర్నూలుకు వచ్చిన ఆయన స్థానిక అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశమై మాట్లాడారు. జగనన్న కాలనీల్లో జరుగుతున్న విద్యుద్దీకరణ పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడకుండా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ చర్యలతో కోతలు లేకుండా విద్యుత్ సరఫరా అవుతోందని, అత్యవసర, చిన్న కారణాలతో ఏర్పడే అంతరాయాలను సిబ్బంది వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. విద్యుత్ బిల్లుల వసూలులో 100 శాతం లక్ష్యం చేరాలన్నారు. వ్యవసాయానికి మెరుగైన విద్యుత్ అందించేందుకు చర్యలు చేపట్టామని, ఇందులో సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. అర్హులైన వారికి విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేందుకు ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు స్తంభా, సామగ్రీ సిద్ధంగా ఉందని, వీటి మంజూరులో జాప్యం లేకుండా చూడాలన్నారు. ఏదైనా కారణాలు చూపి రైతులను పదేపదే తిప్పుకుంటూ ఉంటే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే పట్టణ ప్రాంతాల్లో 24 గంటల్లో, గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటల్లో మార్చి కొత్తది ఏర్పాటు చేయాలని, విద్యుత్ చౌర్యం, వృథాను అరికట్టి, భద్రతపై దృష్టి పెట్టాలని సూచించారు. సరఫరా, సేవలు, సమస్యల పట్ల స్పందన, బిల్లుల వసూలులో ఉమ్మడి కర్నూలు జిల్లా బాగుందని, ఇదే లక్ష్యంతో పనిచేస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు. సమావేశంలో పాల్గొన్న కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. సమావేశంలో కన్‌స్ట్రక్షన్ ఈఈ రాజేష్, డీఈఈలు రంగస్వామి, ఎల్లప్ప, వి. విజయభాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మేయర్‌కు శుభాకాంక్షల వెల్లువ



క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మేయర్ రామయ్య

కల్లూరు: నగర పాలక సంస్థ ప్రథమ పౌరుడు మేయర్ బీవై రామయ్య జన్మదిన వేడుకలు గురువారం సాయంత్రం మేయర్ క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మేయర్ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యాన పంటలను ప్రోత్సహించండి

సి.బెళగల్: ఉపాధిహామి పథకం కింద ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించి వారిని ప్రోత్సహించాలని ఎంపీడీఓ రాముడు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మండల ఉపాధిహామి అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఉద్యోగులు పనిచేయాలని, ప్రభుత్వ పథకాలను రైతులకు, అర్హులైన లబ్ధిదారులకు చేరేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వం ఉద్యాన పంటలలో భాగంగా పండ్ల తోటలు, పూల తోటల పెంపకాలకు భారీగా ప్రోత్సాహకాలను అందజేస్తున్న విషయాన్ని రైతులకు వివరించాలని సూచించారు. మండలంలో ఉద్యావన పంటల లక్ష్యం 200 ఎకరాల సాగుకు గాను ఇప్పటి వరకు 118 ఎకరాలు సంబంధించిన రైతులు ముందుకు వచ్చారని సమీక్షలో ఏపీఓ లక్ష్మన్న వెల్లడించారు. సమావేశంలో సి.బెళగల్ గ్రామ సర్పంచ్ పాండురంగన్న, ఉపాధి ఈసీ పృధ్విరాజ్, టీఏ రామ్‌శంకర్ తదితరులు ఉన్నారు.

బైక్ ఢీకొని మహిళకు గాయాలు

పాణ్యం : మండల పరిధిలోని గోనవరం గ్రామం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన ఖాదర్‌బీ రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తుండగా వెనక నుంచి వేగంగా వస్తున్న బైక్ ఢీకొంది. ఈ ఘటనలో మహిళలకు కాలు విరగ్గా , చేతికి కూడా గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించారు.